క్లుప్తంగా

భోజన పథకం తనిఖీ

పామర్రు (పమిడిముక్కల): పమిడిముక్కల మండలం పెనుమత్స గ్రామంలోని శ్రీ దండ మూడి వీరయ్య స్మారక ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జెడ్పీటీసీ సభ్యురాలు, జెడ్పీ విద్యా వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో కూడిన తాజా పదార్థాలతో వండిన ఆహారం విద్యార్థులకు ఇవ్వాలన్నారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, ఎంపీటీసీ జుఝువరపు శృతి, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, జుఝువరపు తిరుమలరావు, జె.సందీప్, ఉప సర్పంచ్ గుర్విందపల్లి సౌమ్య, దారపు రమాదేవిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకిత భావం అవసరం

తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదువుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ర్యాంక్ ఎడ్జ్ అకాడమి డైరెక్టర్ ఏఎస్ఎస్ శంకరరావు సూచించారు. మండలంలోని పెనమకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు రసాయన శాస్త్రంపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సీతారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జమీగొల్వేపల్లి (పామర్రు): పీఏసీఎస్ సంఘ సభ్యులకు సహాయ సహకారాలు అందుతాయని జమీగొల్వేపల్లి పీఏసీఎస్ అధ్యక్షురాలు కనుమూరి ధనలక్ష్మి అన్నారు. జమీగొల్వేపల్లి పీఏసీఎస్ సంఘ పరిధిలోని గొల్వేపల్లి గ్రామానికి చెందిన మృతురాలు కొమ్ముకూరి ఏసుకుమారి(67) కుటుంబ సభ్యులకు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘ సభ్యురాలైన ఏసు కుమారి మృతి చెందటంతో పీఏసీఎస్ తరపున మృతురాలి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం ఆమె భర్త కొమ్ముకూరి దాసుకు అందజేశామని అన్నారు. పీఏసీఎస్ ఉద్యోగి రవితేజ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లభనేని బుల్లిబాబు, మాజీ అధ్యక్షుడు లింగమనేని సూర్యనారాయణ, కొల్లి నాయుడమ్మ, సీహెచ్ సురేష్, శ్రీకాంత్, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని ఎంపీడీవో పి.మల్లీశ్వరి బుధవారం తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చిస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ఉద్యోగాలకు 9 మంది ఎంపిక



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్‌లో 9 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. బెంగుళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ నిర్వహించిన ఈ ఎంపికలో మొత్తం 70 మంది విద్యార్థులు పాల్గొనగా 9 మంది అర్హులై ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన వివరించారు. ట్యాప్ అకాడమి హెచ్‌ఆర్ మేనేజర్లు సుఫియన్‌ఖాన్, షాహిద్, అఫ్రీన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో మేలు



తోట్లవల్లూరు: భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని దేవరపల్లిలో డ్రోన్ ఫ్లై కార్యక్రమం బుధవారం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి డ్రోన్ ఫ్లైని ప్రారంభించటంతోపాటు రీసర్వే ఉపయోగాలను వివరించారు. సంబంధించి 2720 ఎకరాల్లో డ్రోన్ ఫ్లై నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు భీమవరపు శ్రీలక్ష్మి, మండల సర్వేయర్ సురేష్‌బాబు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కార్యవర్గం

కైకలూరు (కలిదిండి): వాసవి క్లబ్ కలిదిండి గోల్డ్ నూతన కార్యవర్గ ఎన్నిక కలిదిండి కల్యాణి ఫంక్షన్ హాలులో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా వేసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ తాతా రజనీకుమారి హాజరయ్యారు. నూతన వాసవి క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్ష, సెక్రటరీ, కోశాధికారిగా నూకల నాగ వెంకట శ్యామలరావుగుప్తా, చక్కా జగన్ మోహనరావు, గొండ్రాల వెంకట సుబ్బయ్య, వనిత కలిదిండి గోల్డ్ అధ్యక్ష, సెక్రటరీ, కోశాధికారిగా నీలి మాధవి, సొలస వసంతలక్ష్మి, మానేపల్లి పద్మావతి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

దళితుల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే కొడాలి నాని
- ఎస్సీలు డ్రైవర్లు, క్లీనర్లుగానే కాదు యజమానులను చేయాలన్నదే లక్ష్యం
- ఐదు ఆర్టీసీ అద్దె బస్సుల ప్రారంభం



ఆర్టీసీ అద్దె బస్సును నడుపుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: రాష్ట్రంలోని దళితులు ఆర్థికంగా ఎదిగి స్థిరపడాలనేదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం రాత్రి కొత్తగా ఆర్టీసీ లీజుకు తీసుకున్న 5 బస్సులను ఆయన ప్రారంభించారు. ఎంఎస్ఈ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.50 లక్షల యూనిట్ విలువతో ఐదు బస్సులను ఎస్సీలకు మంజూరు చేశారు. లబ్ధిదారులు పొందిన ఈ నూతన బస్సును ఆయన బస్టాండ్ నుండి నెహ్రూచౌక్ వరకు నడిపి ప్రయాణికులను, స్థానికులను ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను ఆర్థికంగా స్థిరపర్చేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అందులో భాగంగా దళితులు కేవలం డ్రైవర్లు, క్లీనర్లుగానే మిగిలిపోకుండా వారిని కూడా వాహన యజమానులుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 45 శాతం సబ్సిడీలు ఇస్తూ మిగిలిన మొత్తాలను బ్యాంకు రుణాల ద్వారా పూర్తి పెట్టుబడి ప్రభుత్వం నుంచి అందే ఏర్పాటు చేసి భారీ వాహనాలను అందించి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం వలన వారు ఆర్థికంగా స్థిరపడే ఏర్పాటు చేస్తుందన్నారు. అందులో భాగంగా నియోజకవర్గానికి చెందిన ముగ్గురు దళితులతో 5 బస్సులు ఇవ్వడం జరిగిందని అవి బంటుమిల్లి, కైకలూరు సర్వీసులకు వినియోగిస్తారన్నారు. ఒక రూట్‌లో 280 కిలోమీటర్లు, మరో రూట్‌లో 320 కిలోమీటర్లు సర్వీసులు నడుపుతాయన్నారు. తద్వారా వీరికి స్వయం ఉపాధి కలుగుతుందని ఈ విధమైన అనేక కార్యక్రమాలు లారీలు, టాక్సీకి కార్లు, ఇతర వాహనాలను కూడా ఇస్తున్నందున అర్హులైన వారు వీటిని అందిపుచ్చుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజర్ జి.రాజేష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ యంత్రసేవను ఉపయోగించుకోండి

ఏడీఏ వెంకటమణి

ముదినేపల్లి రూరల్ : రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యంత్రసేవ' పథకాన్ని రైతుల గ్రూపులు ఉపయోగించుకోవాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి కోరారు. మండలంలోని యంత్రసేవ పథకం గ్రూపులకు సంబంధించిన కన్వీనర్లు, కో కన్వీనర్లకు, సభ్యులకు స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ ఆధ్వర్యాన అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సులో ఏడీఏ మాట్లాడుతూ వైఎస్సార్ యంత్రసేవ పథకంలో భాగంగా పలురకాల యంత్ర పరికరాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. ట్రాక్టర్లు, కల్టివేటర్లు, డిస్కులు, రూటావేటర్లు, పొలాల్లో గట్లు వేసే యంత్రాలు, తైవాన్ పంపులు వంటి వాటిని 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. ఈ పథకం గ్రూపుల సభ్యులు తమ వాటాగా పది శాతం సొమ్మును చెల్లిస్తే మిగిలిన 50 శాతం బ్యాంకులు రుణాలుగా అందిస్తాయన్నారు. వ్యవసాయాధికారి వేణుమాధవ్ మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న యంత్ర పరికరాలను గ్రూపుల సభ్యులు తమ అవసరాల మేరకు వాడుకోవడంతో పాటు ఇతర రైతులకు నిర్ణీత రుసుముతో అద్దెకు ఇవ్వవచ్చన్నారు. ఆసక్తి ఉన్న గ్రూపులు ఈ నెలాఖరు లోపు యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సదస్సులో మండలంలోని వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

మండవల్లి: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు సహాయ వ్యవసాయ సంచాలకులు జి వెంకటమణి శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మినుము పంట ఈ-క్రాప్ పూర్తిచేయాలని తెలిపారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోని రైతులు, వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి షేక్‌జరీనా మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డులు తీసుకున్న రైతులు 5గురిని గ్రూపుగా ఏర్పాటు చేసి బ్యాంక్ వద్ద లోన్ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

సీపీఎం నేతల ర్యాలీ

పవన్ కుమార్‌పై దాడికి ఖండన



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడటౌన్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్‌పై పోలీసుల దాడి సరైన విధానం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. పవన్‌కుమార్‌పై దాడి నిరసిస్తూ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘ నాయకునిగా తమ సమస్యలను కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు వివరించేందుకు వెళ్లిన పవన్‌కుమార్‌పై విచక్షణారహితంగా దాడిచేసి గాయాలపాలు చెయ్యడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దాడికి పాల్పడిన చిలకలపూడి ఎస్ఐ వాసు, ఇతర కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్ శివ, ఆర్ కొండ, పి.రజిని, బి.అరుణ, పి. వీరమ్మ, ఎండి షౌకతున్నీసా, ఎల్ సురేంద్ర, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకులు విద్యార్థులతో కలిసి మంగళవారం అడ్మిషన్ ర్యాలీని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో అడ్మిషన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎస్.కృష్ణ మోహన్ పర్యవేక్షణలో మొవ్వ డిగ్రీ కళాశాలలో విద్య, ఇతర సదుపాయాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీని నిర్వహించారు. క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ విద్యార్థులతో, అధ్యాపకులతో మాట్లాడి తమ డిగ్రీ కళాశాలలో జాయిన్ అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ టి శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ కేఆర్ మంజుల, అధ్యాపకులు శివ నాగేశ్వరరావు, డాక్టర్ ఎల్‌వి.కృష్ణారావు, డాక్టర్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్

ప్రారంభించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న వైద్యశాఖ మంత్రి విడదల రజిని, పక్కన ఆస్పత్రి చైర్మన్ అమర్ అగర్వాల్

లబ్బీపేట(విజయవాడతూర్పు):నేత్రవైద్యంలో అగ్రగామిగా ఉన్న డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ విజయవాడలోనూ అందుబాటులోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మహాత్మాగాంధీరోడ్డు రాఘవయ్యపార్కు ఎదురుగా అంతార్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రవైద్యంలో డాక్టర్ అగర్వాల్స్ హాస్పిటల్‌కు ఒక ప్రాముఖ్యత ఉందన్నారు. అలాంటి హాస్పిటల్ విజయవాడలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రిల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు ప్రైవేటు రంగంలో కూడా నాణ్యమైన సేవలు అందించడం స్వాగతించే విషయమన్నారు. డాక్టర్ అగర్వాల్స్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ మాట్లాడుతూ రానున్న మూడేళ్లలో రాష్ట్రంలో రూ.500 కోట్లు వెచ్చించి 30 ఆస్పత్రులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రస్తుతం ఇండియాతో పాటు, ఆఫ్రికా ఇతర దేశాల్లో 137 ఆస్పత్రు ఉన్నాయని పేర్కొన్నారు. 2023 చివరి నాటికి 200ల ఆస్పత్రులకు విస్తరించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఆరోగ్య రంగంలో వేగవంతమైన పురోగతి సాధిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలోభాగంకావాలని తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తామన్నారు. క్లినికల్ సర్వీసెస్ రీజినల్‌హెడ్ డాక్టర్ కాంద్రుకల్యాణ శ్రీనివాస చక్రవర్తి,డాక్టర్ రమ్య, డాక్టర్ మేఘన పాల్గొన్నారు.



గొల్లపూడిలో తలశిల రఘురాం సతీమణి స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

ఆకస్మిక తనిఖీ

మండవల్లి: మండలంలోని చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ పి.మల్లీశ్వరి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో తాగునీరు సక్రమంగా ఉందా లేదా అని కుళాయిలను పరిశీలించారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్ విజ్ఞప్తి
- మట్టగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం



మట్టగుంట గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు(కలిదిండి): గ్రామాల్లో పెద్ద ఎత్తున జరుగుతోన్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మట్టగుంటలో బుధవారం జరిగింది. ముందుగా గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మూడున్నరేళ్లలో గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో పారదర్శక పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోన్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ కొనియాడారు. ఆయన ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే కై కలూరు నియోజకవర్గం ఈ కార్యక్రమంలో ముందు వరసలో ఉందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు పథకాల అమలకు సిఫార్సులు చేస్తేనే దక్కేవన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా 1వ తేదీన సూర్యోదయం ముందే పింఛన్లును వలంటీర్లు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు నంబూరి శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, నాయకులు గద్దె ఆనంద్, పాము రవికుమార్, బలే నాగరాజు, నీలపాల భోగేశ్వరరావు, ద్రోణాద్రి ఫ్రాన్సిస్, నున్న కృష్ణబాబు, మండా నవీన్, వలవల శ్రీను, కందుల వెంకటేశ్వరరావు, షేక్ చాంద్ బాషా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించండి

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు



ముదినేపల్లి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ సారథులు పార్టీ ఇచ్చిన ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని సూచించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ నేతలు శొంఠి నాగరాజు, అల్లాభక్షు, జాస్తి రాజేంద్రప్రసాద్, బేతపూడి వెంకటరమణ, ఎంపీటీసీలు జంపన కోటయ్య, కోటే ప్రవీణ్, తుమ్మలచర్ల ఏసు, సొసైటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణచంద్రరావు, ముత్యాల రాంబాబు పాల్గొన్నారు.

రేపు కనకదుర్గ అమ్మవారి మహోత్సవం

మొవ్వ: కూచిపూడి దుర్గా నగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 4గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పంచామృతం, అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహిస్తామని వివరించారు. ఉదయం 11.35 గంటలకు అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. యావన్మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా పిలుపు నిచ్చారు.

ఆధ్యాత్మిక భావం పెంచుకోవాలి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



జాతర కళాకారులతో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవాలని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర మహోత్సవాల కారణంగా గ్రామాల్లో సోదర భావం పెంపొందుతుందన్నారు. సమైక్యతకు ఇటువంటి జాతరలు ఎంతగానో దోహదపడతాయన్నారు. చిన్నా పెద్ద అందరూ కలిసి ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయటం అభినందనీయమని అన్నారు. అనంతరం జాతరలో పాల్గొన్న కళాకారులతో కలిసి కాసేపు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోపణలపై విచారణ చేశాం

మున్సిపల్ ఆర్‌జేడీ



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణ

గుడివాడటౌన్: మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల్లో కొన్ని అక్రమాలు జరిగినట్లు వచ్చిన సమాచారంపై విచారణ నిర్వహించామని మున్సిపల్ ఆర్‌జేడీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అసిస్టెంట్ కమిషనర్ శానిటేషన్‌కు సంబంధించి కొన్ని బిల్లులు పనులు జరుగకుండానే మంజూరుచేశారని ఆరోపణలపై ఫిర్యాదురావడంతో అన్ని సెక్షన్లలో బిల్లుల చెల్లింపుపై క్షుణ్ణంగా పరిశీలన చేశామన్నారు. కొంతమేరకు సమాచారం సేకరించామని దీనిని ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. నివేదిక పరిశీలించిన అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

గుడివాడటౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో బుధవారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్టేడియం ప్రాంగణంలో వాకర్స్‌కు ఈ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ బరువు, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. సుమారు 200 మందికి పైబడి ఈ పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అర్జా ప్రసాదు, వంగపండు బ్రహ్మాజీ, చింత దుర్గా రామకృష్ణ, సభ్యులు ఎల్‌ఈ వెంకటేశ్వరరావు, ఎం.శివరామకృష్ణ, బొగ్గారపు తిరుపతయ్య, మున్నలూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరాలయం హుండీ కానుకల లెక్కింపు

గుడివాడటౌన్: స్థానిక మెయిన్‌రోడ్‌లో విఘ్నేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. దేవదాయశాఖ డివిజన్ తనిఖీ అధికారి వి.సుధాకర్, ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ సమక్షంలో భక్తులు లెక్కించారు. హుండీ ఆదాయం రూ.5,04,484 వచ్చినట్లు అధికారులు తెలిపారు. గత ఐదు నెలలుగా ఆలయానికి భక్తులు ఇచ్చిన కానుకల మొత్తం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ చైర్మన్ జి.చంద్రశేఖర్, సభ్యులు సూర్యనారాయణ, నీలవేణి రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): దుకాణాల్లో నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని గుడివాడ లేబర్ ఆఫీసర్ బిందు హెచ్చరించారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో చిల్లర దుకాణాల్లో అమ్ముతున్న రేట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ఎంఆర్‌పీ రేట్ల కంటే ఎక్కువ ధరకు అమ్మకూడదన్నారు.


దుకాణాదారులు తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలన్నారు. దుకాణాల్లో వ్యాపారులు నిత్యావసర వస్తువులు అధిక ధరలకు అమ్మితే లేబర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. అనంతరం చైల్డ్‌లేబర్, వెట్టి చాకిరి నిర్మూలనపై, ఈ-శ్రమ, వైఎస్సార్ బీమాపై ప్రజలకు అవగాహన కల్పించారు.

వెండి నగలు బహూకరణ

గుడ్లవల్లేరు(కౌతవరం): గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో శ్రీ గౌతమేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న ఛండీ హోమానికి భక్తులు రూ.లక్ష విలువగల వెండి నగలను బహూకరించినట్లు ఆలయ చైర్మన్ ఆరేపల్లి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి చిన్ని దంపతులు రూ.లక్ష విలువచేసే వెండి కళ్లు, వడ్డాణం, మొలతాడు తదితర వెండి నగలను స్వామివారికి బహూకరించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుమస్తా అశ్రద్ధ వల్లే సమస్య

పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు



పామర్రు: మండల పరిధి జమీగొల్వేపల్లి పంచాయతీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్(గుమస్తా) ఏ.కనకరాజు అశ్రద్ధ కారణంగానే పంచాయతీ తాళాలు పోయాయని గ్రామ కార్యదర్శి రాళ్ల బండి సుబ్రమణ్యేశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జమీగొల్వేపల్లి పంచాయతీ తాళాలు ఎప్పుడూ గుమస్తా కనకరాజు వద్దే ఉంటాయని అన్నారు. ఈనెల 13వ తేదీన సోమవారం తాళాలు తెమ్మని అడగ్గా లోబీపీ, అనారోగ్యం కారణంగా తాళాలు ఎక్కడో పోయాయని గుమస్తా తెలిపాడని కార్యదర్శి వివరించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయం తాళం బద్దలు కొట్టడం జరిగిందని సెక్రటరీ వివరణ ఇచ్చారు. పంచాయతీ తాళాలు పోవడానికి గ్రామ సర్పంచ్‌కు ఏవిధమైన సంబంధం లేదని కార్యదర్శి తెలిపారు. సమావేశంలో జమీగొల్వేపల్లి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.